మట్టి నమూనా సేకరించు.. భూసారం రక్షించు

- మండలానికి వెయ్యి ఎకరాలకుపైగా లక్ష్యం
- నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయశాఖ
- కొన్ని చోట్ల నమూనాలు సేకరిస్తున్న రైతులు


మట్టి నమూనాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

పెడన: పంట భూమి సారవంతంగా ఉంటే మంచి దిగుబడులొస్తాయనేది ప్రతి రైతుకు తెలిసిన విషయమే. అయితే ఇటీవల కాలంలో చాలా మంది రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తుండటంతో భూసారం కోల్పోయి దిగుబడులు తగ్గుతుండమే కాకుండా అనారోగ్యాలకు గురికావాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం కూడా భూసార పరీక్షలు చేస్తూ రైతులకు వాటి స్థితిగతులను, ఎటువంటి పోషకాలు కలిగిన ఎరువులను వినియోగించాలని తెలియజేస్తూ అధిక దిగుబడులు వచ్చేలా అధికారులు చైతన్య పరుస్తున్నారు.

పెడన నియోజకవర్గంలో..

పెడన నియోజకవర్గం పరిధిలో 23,268 హెక్టార్లలో వరి, వేరుశనగ, ఉద్యాన తదితర పంటలు సాగవుతున్నాయి. నియోజకవర్గంలో 3,239 హెక్టార్లలో నమూనాల లక్ష్యంగా నిర్ణయించారు.

మండలాలవారీగా..

పెడన మండలంలో 8,425 హెక్టార్లలో సాగు విస్తీర్ణం ఉండగా 1,172 హెక్టార్లలో మట్టి నమూనాలను సేకరించాల్సి ఉంది. గూడూరు మండలంలో 7,749 హెక్టార్లకు గాను 1,080 హెక్టార్లు, బంటుమిల్లి మండలంలో 5,181 హెక్టార్లుకు 721 హెక్టార్లులోను, కృత్తివెన్ను మండలంలో 1,913 హెక్టార్ల సాగు విస్తీర్ణంలో 266 హెక్టార్లలో మట్టి నమూనాలను సేకరించాల్సి ఉంది. మొత్తం 23,268 హెక్టార్లకు గాను 3,239 హెక్టార్లలో మట్టి నమూనాలను సేకరించే పనిలో వీఏఏలు, ఎంపీఈవోలు నిమగ్నమయ్యారు.

గతంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్రి ల్యాబ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు అందుబాటులో ఉంచారు. ఇప్పుడు ఈ పరీక్షలు వేరే ప్రాంతాల్లో తీస్తూ వస్తున్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా..

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించడంతో ఆ మేరకు మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విడతల వారీగా ఒక్క ఎకరా కూడా మిగలకుండా అన్ని పొలాలకు భూసార పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయశాఖాధికారులు కోరుతున్నారు.

> **గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నాం.**
>
> 
>
> మండలంలో నమూనాల సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆయా గ్రామాల్లో రైతులతో సద స్సులు కూడా నిర్వహిస్తున్నాం. రైతులు తమ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవచ్చు.
>
> – నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన మండలం

చిత్తశుద్ధికి చిరునామా భగీరథ మహర్షి

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



కోనేరుసెంటర్: భగీరథ మహర్షి స్ఫూర్తితో జీవితంలో మనం ఏదైనా సాధించవచ్చని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. భగీరథ మహర్షి జయంతిని ఆదివారం జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించాడు. ఆయన మాట్లాడుతూ అకుంఠిత తపస్సుతో గంగను దివి నుంచి భువికి దింపిన భగీరథుడు మహాతపస్వి అని కొనియాడారు. భగీరథుని పట్టుదల, అకుంఠిత దీక్ష ఉన్న వారు జీవితంలో అనుకున్నది ఏదైనా సాధిస్తారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ.సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పట్టపు నానికి ఉప్పాల పరామర్శ

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రైతు సంఘం జిల్లా అడ్వైజరీ కమిటీ మాజీ సభ్యులు మండలంలోని చెరుకుమిల్లికి చెందిన పట్టపు నాని సతీమణి నాగమణి శనివారం రాత్రి మరణించారు. ఆదివారం ఉదయం వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నానికి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన నాయకులు, పలువురు రాజకీయ ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం ఉదయం బంటుమిల్లిలో జరిగాయి.

నగరంలో క్రైస్తవుల ప్రదర్శన



మచిలీపట్నంటౌన్: నగరంలో హౌసింగ్‌బోర్డు కాలనీ సర్కిల్ వద్ద ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న క్రీస్తు దర్శన మహోత్సవాలకు నగర ప్రజలకు ఆహ్వానం పలుకుతూ స్థానిక మెస్సీయ హోలీఫైర్ మినిస్ట్రీస్ సంఘ క్రైస్తవులు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన నగరంలోని ప్రధాన రహదారుల నుంచి సాగింది. 6,7,8 తేదీల్లో ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి జరిగే మహోత్సవాల సభలకు విచ్చేయాలని కోరుతూ ముందుకు సాగారు. ఈ సభల్లో కర్నూల్‌కు చెందిన పాస్టర్ ఫ్రెడ్డిపాల్, బ్రదర్ మధువిక్టర్‌పాల్ పాల్గొని దైవవర్తమానాన్ని అందజేస్తారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సభలకు అందరినీ ప్రేమతో ఆహ్వానిస్తున్నామంటూ వారు కోరారు. ఈ ప్రదర్శనలో చిన్నాపెద్దా, పురుష, మహిళ అనే తేడాలేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర తృతీయ వార్షికోత్సవం



బంటుమిల్లి: స్థానిక షిర్డీసాయి మందిర తృతీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుఝామున నగర సంకీర్తనం నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు పండితుల వేద మంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రధానమూర్తితోపాటు విఘ్నేశ్వర, దత్తాత్రేయుడు ప్రధాన మూర్తులకు వేద మంత్రాల మధ్య పుష్పార్చన చేశారు. సాయంత్రం భక్తులచే విష్ణుసహస్రనామపారాయణ, ఉత్సవమూర్తికి పల్లకీసేవ నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. మందిర కమిటి సభ్యులు ఎస్.శేఖర్, శివ, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం కూడా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. పోర్టురోడ్డులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోలీస్ శాఖకు చెందిన శక్తి టీం సభ్యులు విద్యార్థులు పలు ఇబ్బందికర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో వివరించారు. బాలికలు ఎలాంటి పరిస్థితుల్లో ఎలా మెలగాలి, పోలీసుల సహాయం ఎలా పొందవచ్చును అనే విషయాలను వివరించారు. విద్యార్థులతో పలు పుస్తకాలు చదివించి, స్పోకెన్ ఇంగ్లిషు, లెక్కల్లో తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమాలను జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉపగ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

పిడుగుపాటుకు వరిగడ్డివామి దగ్ధం



కోడూరు: అకాల వర్షం ప్రభావంతో పడిన పిడుగుపాటుకు పది ఎకరాల వరిగడ్డివామి దగ్ధమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పిట్లల్లంక గ్రామానికి చెందిన మారుబోయిన శివశంకరరావు తనకున్న పశువుల అవసరాల నిమిత్తం ఇంటి వద్ద పది ఎకరాల వరిగడ్డివామిని నిల్వ చేసుకున్నాడు. అయితే ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపుతో పాటు అకాల వర్షం కురిసి భారీగా పిడుగులు పడడంతో ఆ పిడుగుపాటుకు పది ఎకరాల వరిగడ్డివామిపై మంటలు చెలగేరాయి. అయితే వర్షం కురవడంతో మంటలు పక్కకు వ్యాపించలేదు. స్థానికులు, అవనిగడ్డ ఫైర్ అధికారులు మంటలు అదుపు చేశారు.

అకాల వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం


బంటుమిల్లి మండలం జానకీరామపురంలో కాలువను తలపిస్తున్న ప్రధాన సీసీ రోడ్డు

పెడన: పట్టణం, మండలంలో ఆదివారం ఉదయం మేఘావృతమైంది. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా కారుమబ్బులు కమ్మేయడంతో జనజీవనం ఒక్కసారిగా హడావుడి పడింది. విపరీతమైన గాలులతో కుండపోత వర్షం గంట సేపు కుమ్మేసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అసలే ఎండలు మండుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడటం, వర్షం పడటంతో ఆదివారం అంతా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. అప్పుడప్పుడు చిరుజల్లులు పడుతూ చల్లగా ఉండటంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీరు కూడా డ్రెయిన్ల ద్వారా వెళ్లిపోవడంతో ఊపిరిపిల్చుకున్నారు. చెన్నూరు గ్రామంలో రెండు ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెరువుల వద్ద కొబ్బరి చెట్లు పడిపోయి విద్యుత్ లైన్లపై పడిపోవడంతో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. సుమారు రూ.20 వేలు నష్టం వాటిల్లిందని విద్యుత్‌శాఖాధికారులు పేర్కొన్నారు.

దేవరపల్లిలో కూలిన విద్యుత్ స్తంభాలు

పెడన: మండల పరిధిలోని దేవరపల్లి గ్రామ పరిధిలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం ఉదయం తీవ్ర గాలులకు, వర్షాలకు ఈ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తక్షణం విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. మరో రూ.20 వేల వరకు నష్టం వాటిల్లిందని, మొత్తం రూ.40 వేలకు పైగా విద్యుత్‌శాఖకు నష్టం వచ్చినట్లు ఆ శాఖాధికారులు తెలిపారు.

ఈదురు గాలులు

మచిలీపట్నంటౌన్: గత కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో తల్లడిల్లుతున్న నగర ప్రజలు ఆదివారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో సేదదీరారు. ఉదయం యథావిధిగా ఎండకాసింది. 9 గంటల తర్వాత ఉన్నట్టుండి ఆకాశంలో కారుమబ్బులు కమ్మి బలమైన ఈదురు గాలులు వీచాయి. అడపాదడపా వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడి నగరమంతా ఏసీ పెట్టినట్లుగా మారటంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. చల్లబడ్డ వాతావరణంతో వర్షాకాలం అనుభూతిని పొందారు. అసలే వేసవి సెలవులతో అల్లరి చేస్తూ గడుపుతున్న చిన్నారులు వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో వారి కేరింతలకు అవధులు లేకుండా పోయింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

బంటుమిల్లి: మండలంలో ఆదివారం ఉదయం కురిసిన అకాల భారీ వర్షం లోతట్టు ప్రాంతాలను జలమయం చేసింది. దాదాపు నెల రోజులుగా మండుతున్న భానుడి ప్రతాపానికి వరుణుడు అడ్డుకట్ట వేశాడు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఉదయం సుమారు 8 గంటల సమయం నుంచి నల్లని మేఘాలు కమ్ముకున్న ఆకాశం చిరుజల్లులతో మొదలై దాదాపు రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు సుమారు 11 సెం.మీ వర్షం నమోదైంది. నల్లని మేఘాలతో ఉదయం 10 గంటల సమయములో సాయంత్రం సంధ్యా సమయాన్ని గుర్తుకు తెచ్చింది. ఈ వర్షంతో జానకీరామపురం, బంటుమిల్లిలో పలు కాలనీల్లో లోతట్టు ప్రాంతాలు, వీధులు జలమయమై తటాకాలు, కాలువలను తలపించాయి. ఈ వర్షం బీడు వారిన భూములకు ఎంతో మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల్లో నేల పచ్చబడితే పశువులకు మేత సమస్య తీరుతుందని వారు పేర్కొన్నారు.

చల్లపల్లిలో భారీ వర్షం

చల్లపల్లి: చల్లపల్లిలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఉదయం గంటసేపు ఎడతెరిపి లేకుండా సుమారు వర్షం పడింది. గాలులు కూడా వీయటంతో మెట్ట రైతులు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం కూడా మబ్బులు పట్టి ఉన్నప్పటికీ పొద్దు పోయే వరకూ వర్షం పడలేదు. ఈ వర్షం కారణంగా రానున్న రోజుల్లో వడగాల్పులు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘంటసాల: మండలంలో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా కురిసిన ఈ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఘంటసాల–రామానగరం ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచి పోవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. ఘంటసాల– మల్లంపల్లి రహదారిలో కూడా వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.


పెడన పట్టణంలో ఆదివారం ఉదయం కమ్మిన కారు మబ్బులు


పెడన మండలం చెన్నూరు గ్రామంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


చల్లపల్లి బస్టాండు వద్ద వర్షానికి జలమయమైన రోడ్డు

ముగిసిన అమ్మవార్ల జాతర


గంగానమ్మ జాతరకు హాజరైన వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, నాయకులు


నాగేశ్వరరావుపేటలో మహాలక్ష్మికి మొక్కుబడులు చెల్లిస్తున్న భక్తులు

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరావుపేట గ్రామ దేవతల మహాజాతర ఆదివారంతో ముగిసింది. ప్రతి 9 సంవత్సరాలకు ఒకసారి గ్రామంలోని దేవతలందరికీ మహాజాతర నిర్వహిస్తారు. గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభమైన మహాలక్ష్మి, అంకమ్మ, గంగానమ్మ, పోతురాజుల జాతర ఆదివారం భక్తులు సమర్పించిన వేడి నైవేద్యాలతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు మేళతాళాలతో గొర్రెలు, మేకపోతులు, కోళ్లు ఊరేగించి అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తులు అమ్మవార్లకు నూతన వస్త్రాలు, గాజులు, పసుపు కుంకుమలు సమర్పించి విశేష పూజలు చేశారు. రామవరపుమోడి గ్రామంలో మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే అంకమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. గత మూడు రోజులుగా జరుగుతున్న జాతర ఉత్సవాలు ఆదివారం సమర్పించిన వేడి నైవేద్యాలతో ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగాయి.

గతం మధురం.. మళ్లీ కలుద్దాం!


చల్లపల్లి ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్లో 1997-98 బ్యాచ్ పూర్వవిద్యార్థులు, గురువులు

చల్లపల్లి: స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్లో 1997–98 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో సహా కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత ఒకరికొరు అందరూ పరిచయం చేసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పించిన గురువులను తగరిశ సాంబశివరావు, డి.జోవహర్, ప్రభాకర్, సీతారామస్వామి, రాయపాటి ప్రసాద్, శాస్త్రిలను శాలు వాలు, పూలమాలలు వేసి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఆనాటి తమ తరగతి గదులను చూసుకుని మురిసిపోయారు. బెంచీలపై కూర్చొని గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. చివరిగా ఒకొరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

7 నుంచి వాసవీ మాత జయంత్యుత్సవాలు

పెడన: పట్టణంలో శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలోని శ్రీవాసవి మాత జయంతోత్సవాలు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, మండల, యువజన ఆర్యవైశ్య సంఘాలు, శ్రీవాసవి మహిళా మండలి, వాసవీ క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన శాఖ తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోజు 7న బుధవారం అమ్మవారికి 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, 8న కుంకుమ పూజలు, 9న లక్ష మల్లెల పుష్పార్చన, సాయంత్రం 6 గంటలకు పట్టణ పురవీధుల్లో శ్రీ వాసవి మాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 10న ఆర్యవైశ్య అన్న సమారాధన కార్యక్రమంతో వాసవి జయంతి మహోత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు పట్టణ శ్రీవాసవి మహిళా మండలి వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులు లలిత పారాయణ సౌందర్యలహరి, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి చరిత్ర చదువుతారని పేర్కొన్నారు. పెడన పట్టణ, మండల పరిసర ప్రాంత ఆర్యవైశ్యులు అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీహనుమత్ లక్ష్మణ సమేత సీతారాముల విగ్రహల పునఃప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అగ్నిధ్యానం, శాంతి హోమాలు నిర్వహించారు. ఉదయం గం.7.02లకు మంగళవాయిద్యాల నడుమ, వేద మంత్రోచ్ఛరణల మధ్య దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి


భగీరథుని చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో భగీరథ మహర్షి చిత్రపటానికి కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ కేఏస్ ప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ ఎస్.వెంకటేష్, సీనియర్ అకౌంటెంట్ జి.అశ్విని కుమార్, కార్యాలయ సిబ్బంది కగ్గా సాంబశివరావు, శేషు బాబు, సాయి నరసింహారావు, గణేష్, జతిన్, నాగ బుల్లయ్య, బ్రహ్మం, అబ్దుల్ షుకుర్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహించారు. భగీరథుని చిత్ర పటానికి పశు సంవర్ధక శాఖ జేడీ చిన నరసింహులు, 45వ డివిజన్ ఇన్‌చార్జ్ పీపీ ఫణికుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగానికి వన్నె తెచ్చిన నజీర్


నజీర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

మచిలీపట్నం(చిలకలపూడి): ఏపీ సర్వే, ల్యాండ్ రికార్డ్స్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఏ.నజీర్ అహ్మద్‌కు ఆదివారం కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో వివిధ సంఘాల నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సభ జరిగింది.

కృష్ణా జిల్లా, ఇతర ప్రాంతాలలో కొన్ని వేల మందికి పెన్షన్ అకౌంట్స్ సెటిల్ చేయడంలో నజీరు సేవలు మర్చిపోలేరని రిటైర్డ్ జిల్లా సర్వే అదనపు డైరెక్టర్ చలపతిరావు అన్నారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ టి.వినయ్ కుమార్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు విడియాల చక్రవర్తి, కృష్ణాజిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు రామస్వామి, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాలాజీ, ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు రాము, కార్యదర్శి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. అనంతరం నజీర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

గూడూరు: మండల పరిధిలో చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేసేందుకు గ్రామ సచివాలయాల వారీగా ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.వనజ ఆదివారం తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో గూడూరు–1, కంకటావ సచివాలయాలు, 7, 8వ తేదీల్లో ఆకులమన్నాడు, లేళ్లగురువు సచివాలయాల్లో, 12, 13 తేదీల్లో కప్పలదొడ్డి, మల్లవోలు– 1 సచివాలయాల్లో, 14, 15 తేదీల్లో పోసినవారిపాలెం, గూడూరు– 2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఇప్పటి వరకు ఆధార్ కార్డులు నమోదు కాని చిన్నారులను శిబిరాలకు తీసుకువచ్చి నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ కోరారు.

భార్యాభర్తలపై దాడి.. కేసు నమోదు

కృత్తివెన్ను: మండలంలోని మాట్లాం గ్రామానికి చెందిన దంపతులపై దాడిచేసిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమాని జలాచంద్రుడు, ముత్యాలమ్మలపై అదే గ్రామానికి చెందిన ఏ.నాగరాజు, సీహెచ్.వెంకటలక్ష్మి వారి పిల్లలు కలసి ఆదివారం కర్రలతో దాడి చేశారు. దీంతో జలా చంద్రడు, ముత్యాలమ్మ గాయపడ్డారు. వారిని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కృత్తివెన్ను పోలీసులు కేసు నమోదు చేశారు. మాట్లాం గ్రామంలో కోర్టు వివాదంలో ఉన్న స్థలం విషయంలో ఫిర్యాదు దారులైన జలాచంద్రడు, ముత్యాలమ్మపై దాడిచేయగా వారు గాయపడ్డారని దీనిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ స్థలంలో ఇటీవల పంచాయతీ వారి చెత్త కుప్పలు ఉండటంతో వాటిని తొలగించి మరలా పరదాలు కట్టగా వాటిని నాగరాజు, వెంకటలక్ష్మి, వారి పిల్లలు తొలగించడంతో ప్రశ్నించిన జలాచంద్రుడు, ముత్యాలమ్మపై దాడిచేసినట్లు తెలిసింది.

సుబ్బారాయుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు బుద్ధు సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. డోకుపర్తి బాల కోటేశ్వరావు, ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.